గుండ్లకమ్మ వెలవెల



నీటి ప్రవాహంతో కళకళలాడాల్సిన గుండ్లకమ్మ నది ఈ ఏడాది నీరు లేక వెలవెలబోతోంది. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రవాహం లేక నది ఎండిపోయింది. నదిపై ఆధారపడిన తాగునీటి పథకాలు పని చేయకపోవడంతో అన్నారం, ఉప్పలపాడు, నాగిరెడ్డిపల్లె, ఐనవోలు, లింగముక్కపల్లె, పువ్వాడ, తెల్లబాడు, తంగిరాల తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలు పని చేయడం లేదు. పశువులకు మేత, నీరు దొరకడం లేదు. సాగర్ జలాలు విడుదల చేస్తేనే తాగునీటి సమస్య కొంతమేర తీరుతుందని పరీవాహక గ్రామాల ప్రజలంటున్నారు. నదికి సాగర్ జలాలు విడుదల చేయాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, నూజండ్ల**

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

అమరావతి, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో సెప్టెంబరు ఒకటి నుంచి వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సైదమ్మబాయ్ తెలిపారు. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని, తొలిరోజు స్వామి వారి దర్శనం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సమస్యల మోత.. ప్రయాణికుల వెత

* తాగునీటికి ఎక్కిళ్లు.. పారిశుద్ధ్యం అధ్వానం
* ఆర్టీసీ బస్టాండ్లలో అసౌకర్యాలు


సత్తెనపల్లి, చిలకలూరిపేట గ్రామీణ, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), మాచర్ల పట్టణం - న్యూస్‌టుడే

పరిశీలన

ప్రయాణాల నిమిత్తం నిత్యం వేలాది మంది తరలివచ్చే జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు పలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. అందుబాటులో లేని తాగునీరు.. పని చేయని సీసీ కెమెరాలు.. అధ్వాన పారిశుద్ధ్యం.. మరుగుదొడ్లు.. వెరసి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చాక మహిళల రద్దీ గణనీయంగా పెరిగింది. అందుకు తగ్గట్లుగా సదుపాయాలు సమకూరలేదు. ఒకవైపు బస్సుల్లో రద్దీ.. మరోవైపు అరకొర వసతులతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లను 'న్యూస్‌టుడే' బృందం పరిశీలించింది. ఆ వివరాలివీ..

* జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు డీపీటీవో అజితకుమారి తెలిపారు. మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వసతి, నిఘా మెరుగ్గా ఉండేలా చూస్తామన్నారు.

చిలకలూరిపేట



పనిచేయని ఆర్వో ప్లాంటు

78 | 30 వేలు

ఆర్వో ప్లాంటు పనిచేయట్లేదు. పంకాలు తిరగట్లేదు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మురుగు ప్రవహించే పైపులైన్లు చెత్త, వ్యర్థాలతో నిండి ఉన్నాయి. రుసుములతో నిర్వహించే మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉద్యోగులు వాడుకునే మరుగుదొడ్లదీ అదే తీరు. సీసీ కెమెరాలు పనిచేయట్లేదు. ఇటీవలే వరుస చోరీలు చోటుచేసుకున్నాయి.

నరసరావుపేట

91 | 35 వేలు

బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పనిచేయట్లేదు. చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిఘా వైఫల్యం కనిపిస్తోంది. మరుగుదొడ్ల నిర్వహణ బాగా లేదు. మినరల్ వాటర్ సదుపాయమున్నా నిర్వహణ బాగాలేక నీరు తాగేందుకు ప్రయాణికులు ఇష్టపడట్లేదు. పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంది.



పరిసరాలు అధ్వానం

సత్తెనపల్లి



ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు

61 | 28 వేలు

రుసుములపై ప్రైవేటు ఏజెన్సీ నిర్వహించే మరుగుదొడ్లు బాగా లేవు. కొత్తవి నిర్మించినా ఇంకా వాడుకలోకి రాలేదు. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చాల్సి ఉంది. సీసీ కెమెరాల్ని పోలీసుశాఖ మెరుగ్గా నిర్వహిస్తోంది. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు తక్కువ.

మాచర్ల

85 | 29 వేలు

బస్టాండ్ ప్రాంగణం, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయి. మంచినీరు తాగేచోట కార్గోకు చెందిన వస్తువులు పడేయడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. సీసీ కెమెరాల నిర్వహణ బాగా లేదు.



ఆవరణ ఇలా..

బస్సుల సంఖ్య: (నీలం) | రోజూ వచ్చే సగటు ప్రయాణికులు: (ఎరుపు)

సజావుగా నీట్ పీజీ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నరసరావుపేటలోని నాలుగు కేంద్రాల్లో నీట్ పీజీ- 2026 ఆదివారం ప్రశాంతంగా సాగింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కేంద్రంలో 454 మంది విద్యార్థులకు 441 మంది పరీక్ష రాశారు. ఏఎం రెడ్డి స్మారక ఇంజినీరింగ్ కళాశాలలో 255 మందికి 249, తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో 195 మందికి 192, ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 80కు 74 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష సజావుగా ముగిసినట్లు అధికారులు తెలిపారు.

పచ్చందాల రహదారి

చిలకలూరిపేట బైపాస్‌కు జాతీయస్థాయిలో ప్రథమస్థానం



కూడలి వద్ద కనువిందుగా..

పండరీపురం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే

చెన్నై - కోల్‌కత్తా 16వ నంబరు జాతీయ రహదారిలో భాగంగా రామచంద్రాపురం అడ్డరోడ్డు నుంచి తిమ్మాపురం వరకు 16.384 కి.మీ. చిలకలూరిపేట బైపాస్ వెంబడి మొక్కల పెంపకం ప్రత్యేక గుర్తింపు పొందింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) గ్రీన్ హైవేస్ ఎక్స్‌లెన్స్ అవార్డు కింద అమరావతి ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ పరిధిలోకి వచ్చే చిలకలూరిపేట బైపాస్‌కు జాతీయస్థాయిలో మొదటి బహుమతి లభించింది. ప్రాజెక్టు రహదారి నిర్మాణానికి పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఇందులో భాగంగా చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రథమ బహుమతిని సాధించింది.

చిలకలూరిపేట బైపాస్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంతో బాధ్యతగా చేపట్టారు. భద్రత, పర్యావరణం, సౌందర్యం అనే అంశాలను సమన్వయం చేస్తూ చిలకలూరిపేట జాతీయరహదారిని గ్రీన్ కారిడార్‌గా మార్చారు. చెట్ల ఎంపికలోనూ నేల స్వభావం, వర్షపాతం, ఉష్ణోగ్రతకు తగిన జాతుల మొక్కలను ఎంపిక చేశారు. వేప, గానుగ, చింత, తెల్ల బంగారం, కొండచింత, తెల్లమద్ది, రేల తదితరాలతోపాటు పూల మొక్కలు, అందంగా ఉండే గడ్డి మొక్కలతో తీర్చిదిద్దారు. ఎడమ వైపున 970, కుడి వైపున 4075.. మొత్తం 5051 మొక్కలు నాటి రహదారికి ఇరువైపులా పచ్చదనాన్ని పరిడవిల్లేలా చేశారు. కడియం వద్ద నర్సరీలో రెండేళ్లు పెరిగిన మొక్కలు తీసుకొచ్చి నాటడంతో త్వరితగతిన పచ్చదనం పరచుకుంది. ప్రతి మొక్కకు ఐరన్ ట్రీ-గార్డు ఏర్పాటు చేశారు. సర్వీసు రోడ్డు పక్కన పశువుల నుంచి రక్షణకు ప్రత్యేక కంచె నిర్మించారు.



బైపాస్ వెంట ఎవెన్యూ ప్లాంటేషన్

శ్రమకు ఫలితం దక్కింది.. 'చిలకలూరిపేట బైపాస్ రహదారి నిర్మాణం 2024 సెప్టెంబరులో పూర్తయ్యింది. అప్పటి నుంచి రహదారికి (16.384 కి.మీ.) ఇరువైపులా మొక్కలు నాటడంతోపాటు సంరక్షణ చర్యలు చేపట్టాం. నీటిని పెట్టడంతోపాటు అవసరమైన ఎరువులు వినియోగిస్తున్నాం. జాతీయస్థాయిలో ప్రథమస్థానం రావడంతో మా శ్రమకు ఫలితం దక్కింది. దీన్ని ఇలాగే కొనసాగిస్తాం' అని చిలకలూరిపేట బైపాస్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ పీడీ మురళీమోహన్ తెలిపారు.

ఆనందంగా ఉంది.. 'జాతీయస్థాయిలో మొదటి స్థానం రావడం చాలా సంతోషంగా ఉంది. సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. రహదారి అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమని చిలకలూరిపేట బైపాస్ నిరూపించింది' అని అమరావతి ఎన్‌హెచ్ఏఐ పీఐయూ టెక్నికల్ మేనేజర్ బి.వెంకటేశ్వర్లు వివరించారు.

అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు?

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పలపాడు, గుంటగార్లపాడు గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఉప్పలపాడు సమీపంలోని చెరువులో పొక్లెయిన్లతో మట్టిని తవ్వి టిప్పర్ లారీల్లో నింపి బహిరంగంగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్ మట్టి రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు అమ్ముకుంటున్నారని, ట్రక్కు మట్టి రూ.2 వేలకు పైగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే గుంటగార్లపాడు సమీపంలోని కాలువను తవ్వి మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే అదనుగా భావించి కొందరు ఈనాం భూముల ఆక్రమణకు యత్నిస్తున్నట్లు సమాచారం.

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదాలు.. చెరువులో మట్టి తవ్విన ప్రాంతమంతా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసి చెరువులోకి నీరు చేరితే గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. పశువులు నీరు తాగేందుకు దిగుతుంటాయని, ఆ సమయంలో గుంతల్లో చిక్కుకొని బయటకు రాలేక మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఉప్పలపాడు చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్

మట్టి తోలకం నిలిపేశాం.. ఉప్పలపాడులో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నారనే సమాచారం తెలియగానే వీఆర్‌వోను పంపి వెంటనే నిలిపివేశామని తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. మరోసారి అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుంటగార్లపాడులో మట్టి తవ్వకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్వచ్ఛత.. పరిశుభ్రత

గ్రామ పంచాయతీల మధ్య పోటీ

సత్తెనపల్లి, చిలకలూరిపేట గ్రామీణ, శివాలయం ఏరియా (పిడుగురాళ్ల), సాతులూరు: గ్రామాల్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా మార్చే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి. గత రెండేళ్లలో పల్లెల్లో ఘన వ్యర్థాల నిర్వహణ, సంపద సృష్టికి అత్యంత ప్రాధాన్యమిచ్చాయి. ప్లాస్టిక్‌ను తరిమేసేందుకు స్వచ్ఛరథాల్ని తీసుకొచ్చాయి. అయినా గ్రామాల్లో అపరిశుభ్రత, అధ్వాన పారిశుద్ధ్యం కనిపిస్తూనే ఉంది. స్వచ్ఛతలో గ్రామ పంచాయతీల మధ్య పోటీతో పల్లెటూళ్లను సుందరంగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు-2026 పేరుతో పోటీకి శ్రీకారం చుట్టింది. ❖ స్వచ్ఛత కార్యక్రమాల సమర్థ నిర్వహణను ప్రధాన అంశంగా తీసుకుని పోటీ నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల మధ్య ఈ పోటీ ఉండనుంది. ఇప్పటికే దీనిపై మండల, గ్రామ స్థాయి అధికారులకు మార్గదర్శకాలందాయి. రెండు విభాగాల్లో పోటీ ఉంటుంది.



ఇలా పరిశుభ్రంగా ఉంటే అవార్డుల్లో ప్రాధాన్యం

అంశాలివి.. ఇలా.. ✶ స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో రాష్ట్రస్థాయి ఆరు, జిల్లాస్థాయి ఐదు అవార్డులు ఇవ్వనున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వీధుల శుభ్రత, ఇంటింటా చెత్త సేకరణ, సేంద్రియ వ్యర్థాల నిర్వహణ, తోటల పెంపకం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకుంటారు. ✶ తొలిసారి స్వచ్ఛ దూతలకు (పారిశుద్ధ్య కార్మికులు) కూడా పోటీలో పాల్గొనే అవకాశం కల్పించారు. వీరికి రాష్ట్రస్థాయిలో మూడు, జిల్లాస్థాయిలో ఐదు అవార్డులు ఇవ్వనున్నారు. విధులపై శ్రద్ధ, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణలో ఆదర్శ పద్ధతులు, వ్యర్థాల విభజనపై ప్రజలకు అవగాహన కల్పించడం, బాధ్యతగా పని చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఆన్‌లైన్‌లో కార్మికులు తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాస్థాయి బృందాలు వారి పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆదర్శ కార్మికులను ఎంపిక చేస్తాయి. స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తామని డీపీవో నాగేశ్వరరావు నాయక్ తెలిపారు.

బుగ్గవాగు నుంచి 5,446 క్యూసెక్కులు విడుదల



ప్రకాశం జిల్లాలోకి ప్రవేశిస్తున్న సాగర్ జలాలు

వినుకొండ, బొల్లాపల్లి: తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ జలాశయం నుంచి విడుదల చేసిన నీరు ఆదివారం పల్నాడు జిల్లా సరిహద్దులోని గుట్లపల్లి హెడ్ రెగ్యులేటర్ దాటి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించింది. మార్గం మధ్యలో నీరు వృథా కాకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి బుగ్గవాగు నుంచి 5,446 క్యూసెక్కులు విడుదల అవుతుండగా అందులో గుంటూరు బ్రాంచి కెనాల్‌కు 1200, అద్దంకి బ్రాంచి కెనాల్‌కు 805, ఒంగోలు మెయిన్ కెనాల్‌కు 2140 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని చెరువులను ప్రాధాన్య క్రమంలో నింపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అడుగంటిన వినుకొండ పట్టణ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సింగరచెరువుకు పెరుమాళ్లపల్లె మేజర్ కాలువ నుంచి నీటిని విడుదల చేశారు. పల్నాడు జిల్లాలో 9 మున్సిపల్, 121 ఆర్‌డబ్ల్యూఎస్ చెరువులను నింపనున్నారు. నీరు వృథా చేయొద్దని కుడి ప్రధాన కాలువ ఈఈ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. కాలువ నీటిని పంట చేలకు వాడుకునేందుకు అనుమతి లేదని తెలిపారు.

కాలువ కట్టపై ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాల్సిందే

ఈనాడు కథనానికి స్పందన

వినుకొండ, బొల్లాపల్లి, న్యూస్‌టుడే: సాగర్ కుడి ప్రధాన కాలువపై అనుమతి లేకుండా వ్యవసాయ కనెక్షన్ల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని ఎన్నెస్పీ ఈఈ ఆర్.మల్లికార్జునరావు ఆదేశించారు. 'నిబంధనలకు నీళ్లొదిలేశారు' శీర్షికన ఈ నెల 30న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు వారందరికీ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు కాలువ కట్టపై నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి తమ పొలాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వరుణుడి కరుణకు పూజలు



ఈపూరు మండలం ఊడిజర్ల గ్రామస్థులు వర్షాల కోసం ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి తొలుత మహాలక్ష్మమ్మకు పానకం, వడపప్పు సమర్పించారు. అనంతరం ఇంటింటా పొంగలి వండి ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్లి పోలేరమ్మకు నైవేద్యం పెట్టారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, ఈపూరు**

అమరావతి అమ్మాయిలు.. క్రికెట్‌లో మెరుపులు



మంగళగిరిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబరు 15 నుంచి 26 వరకు మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) జరగనుంది. ఇందులో అమీతుమీ తేల్చుకునేందుకు నాలుగు జట్లు సిద్ధమయ్యాయి. ఈ జట్లలో ఒకటైన 'అమరావతి ఈ ఛాంపియన్స్'లో కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన నలుగురికి స్థానం లభించింది. భారత మహిళా క్రికెట్ జట్టులో స్థానం పొంది విజయాలను ఆస్వాదించడమే లక్ష్యమంటున్న వీరిపై ప్రత్యేక కథనం. - **న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు**



★ పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన **కందుల హేమ సాయి రమ్యారెడ్డి** ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మేనమామ ప్రోత్సాహంతో 2022లో జీవీఆర్ అకాడమీలో కోచ్ పవన్ సూర్య పర్యవేక్షణలో సాధన ప్రారంభించింది. 2023లో విజయవాడలోని కేకే గ్లోబల్ క్రికెట్ అకాడమీలో నూర్‌బాషా వద్ద శిక్షణ పొందింది. అండర్-19 ఏసీఏ ఇంటర్ జోనల్ టోర్నీలో సెంట్రల్ జోన్‌కు ఆడి, సౌత్ జోన్ జట్టుపై 80 పరుగులు చేసింది. రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా, రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్ బౌలర్‌గా రాణిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెస్కే క్రికెట్ అకాడమీలో సాధన చేస్తోంది.

★ ఇబ్రహీంపట్నం మండలం జూపూడికి చెందిన **పరసా రంగలక్ష్మి** డిగ్రీ చదువుతోంది. చిన్నతనంలోనే క్రికెట్‌పై ఆమెకు ఉన్న ఆసక్తిని గమనించిన తండ్రి శ్రీహరి గౌడ్ 2014లో ఐజీఎంసీ స్టేడియంలో కోచ్ చిరంజీవి వద్ద శిక్షణకు చేర్పించారు. బీసీసీఐ లెవల్-2 కోచ్ నిర్మల్‌కుమార్ పర్యవేక్షణలో మెరుగులు దిద్దుకుంది. అండర్-16, 19, 23, సీనియర్స్ కేటగిరీల్లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2023లో కోల్‌కత్తాలో జరిగిన అండర్-23 వన్డే టోర్నీలో త్రిపుర జట్టుపై 172 పరుగులు చేసింది.

★ గుంటూరు ఎస్వీఎన్ కాలనీకి చెందిన **కాట్రగడ్డ దీక్ష** లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. స్వతహాగా క్రికెటరైన తండ్రి శేషసాయిని స్ఫూర్తిగా తీసుకొని ఏడేళ్ల వయసులో ఎమ్మెస్కే క్రికెట్ అకాడమీలో గోపి పర్యవేక్షణలో సాధన ప్రారంభించింది. 2024-25 సీజన్‌లో ఆంధ్రా అండర్-15 జట్టుకు సారథ్యం వహించింది. సౌరాష్ట్ర జట్టుపై 53 బంతుల్లో 128 పరుగులతో రాణించింది. ఇండియా అండర్-19 జట్టులో స్థానం పొంది శ్రీలంకతో ఆడిన వన్డే, టీ20 సిరీస్‌లను కైవసం చేసుకోవడంలో కీలకంగా నిలిచింది. రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా సత్తా చాటుతోంది.



★ గుంటూరుకు చెందిన **బోగియ సాయి దీప్తి** జేకేసీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండ్రి రాజు పర్యవేక్షణలో 2014లో సాధన ప్రారంభించింది. జేకేసీ కళాశాల మైదానంలో పీడీ రాజేష్ శిక్షణలో రాటుదేలింది. 2022 నుంచి 2025 వరకు ఆంధ్రా అండర్-19 జట్టుకు ఆడింది. ముంబయి, పుణెలో జరిగిన ఆరు అంతర్రాష్ట్ర మ్యాచుల్లో 13 వికెట్లు, 2025లో ఔరంగాబాద్, కోల్‌కత్తాలో జరిగిన నాలుగు టీ20 మ్యాచుల్లో 7 వికెట్లు తీసింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలర్‌గా, రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా రాణిస్తోంది.



బీమా చేద్దాం.. ధీమాగా ఉందాం

నేటితో ముగియనున్న వరి ప్రీమియం చెల్లింపు గడువు

గాంధీనగర్, కుమ్మరిపాలెం, (పిడుగురాళ్ల) సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వ్యవసాయం ఇంకా గాడినపడలేదు. ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులు జాగరూకతతో వ్యవహరిస్తే వారికి మేలు జరిగే అవకాశముంది. ముఖ్యంగా బీమా, ఈ-పంట నమోదు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తంగా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే ప్రోత్సాహకాలు అందే అవకాశం ఉంటుంది.

జిల్లాలో ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తున్న రైతులు ఈ నెల 31వ తేదీలోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. వరి పంట ఎకరాకు రూ.40 వేలు బీమాగా నిర్దేశించారు. రైతులు రూ.80 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. సొంత బావులు, బోర్లపై ఆధారపడి చాలామంది రైతులు వరి సాగుచేస్తున్నారు. వారందరూ బీమా పరిధిలోకి వస్తే పంటకు రక్షణ, భద్రత ఉంటుంది.

❖ ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధశాఖల ఉద్యోగులు చేపడుతున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పత్తి, వరి, కంది, మినుము, పసుపు ఇతర పంటల వివరాలను సెప్టెంబరు 15వ తేదీలోగా నమోదు చేయించుకోవాలి. రైతుసేవా కేంద్రం సిబ్బందికి వివరాలు అందజేస్తే ఈ-పంట నమోదు చేస్తారు. రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు సూచించారు.

అమ్మవారికి తామర పూల అలంకారం



శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా పట్టణంలోని గంగమ్మ తల్లిని 2,516 తామర పూలతో అందంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించారు.

– న్యూస్‌టుడే, పిడుగురాళ్ల

పత్తి రైతుకు గుండెకోత

- రాలుతున్న పూత, పిందె
- పదేళ్లలో తొలిసారి తగ్గిన సాగు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం.. అప్ప వేసవిని తలపిస్తున్న వాతావరణంతో పత్తి సాగు వెలవెలపోతుంది. వరుణుడి కరుణ లేకపోవడంతో తెలంగాణలో సాగు పతనమైంది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా పత్తి సాగు తగ్గిందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జూన్‌లో అంతంత మాత్రంగా కురిసిన వర్షాలకు సాగు చేసిన పత్తి ఎదుముఖం పట్టింది. దీంతో పత్తి సాగుపై ఆధారపడిన రైతుల్లో తీవ్ర నైరాశ్యం అలుముకుంది.

10నుంచి 20 కాయలే.. ఎల్‌నినో ప్రభావంతో సరిగ్గా వర్షాలు లేకపోవడం, దానికి తోడు ఈదురు గాలులకు ఎండుతున్న పత్తి పొలాలను చూసి రైతులకు గుండె కోత మిగులుతోంది. ఇప్పటి వరకు ఎకరాకు రూ.15 వేల నుంచి 20 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. అయినా కూడా శ్రమించి సాగు చేసిన పత్తి పంట పూత, పిందె రాలుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జూన్‌లో సాగు చేసిన పత్తి ప్రస్తుతం పూత, కాయ దశలో ఉంది. ఐదేళ్లు పెరిగిన ఉష్ణోగ్రతలు, గాలులకు విపరీతంగా పూత, పిందె రాలి పోతుండటంతో ఈ సారి పెట్టుబడులు కూడా కష్టమేనని రైతులు వాపోతున్నారు. వర్షాలు లేక పత్తి పంటలో ఎదుగుదల తగ్గిపోయింది. సాధారణంగా ఒక్క పత్తి మొక్కకు 60 వరకు కాయలు రావాల్సి ఉండగా ప్రస్తుతం 10నుంచి 20 మాత్రమే వచ్చాయి. అవి కూడా నిలవడం కష్టంగా మారింది. పూత, పిందె నిలవడం కోసం పురుగుమందులు వినియోగిస్తుండటంతో ఖర్చు కూడా భారీగా పెరుగుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.



బెట్టకు వచ్చిన పత్తి పొలం



ఎత్తు పెరగకుండానే మొక్కకు కాయలు

అదును తప్పింది.. జిల్లాలో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 86,305 హెక్టార్లు కాగా నేటికి 53,916 హెక్టార్లలో పత్తి సాగు చేశారు. అందులో సుమారు 25వేల హెక్టార్ల వేసవిలో పత్తి చేసిన పంట ఉంది. సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో తెల్ల బంగారంగా పిలిచే పత్తి దారుణంగా దెబ్బతింది. ఇక వర్షాలు కురిసినా పత్తిసాగు చేసే పరిస్థితి లేదు. సాగు పూర్తిగా అదును తప్పిపోయిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో పత్తి ప్రధాన సాగు అయితే నైరుతి ప్రవేశం నుంచి తీవ్ర వర్షాభావం నెలకొంది. దీంతో పత్తి సాగు చేసే పరిస్థితి లేకుండా పోయింది. పత్తి సాగులో ముఖ్యంగా పూత, కాయ దశలో ఉన్నప్పుడు నీటి ఎద్దడి ఏర్పడితే పూత రాలి పోయే ప్రమాదం ఉందని ఏవో శివలలిత అన్నారు. దీని అధిగమించటానికి మల్టీ న్యూట్రియంట్స్, నీటిలో కరిగే ఎరువుల పిచికారీ ఎంతో అవసరమన్నారు. సమతుల్య ఎరువుల యాజమాన్యం చేపట్టాలని రైతులకు సూచించారు.

వైకాపా నేత పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులపై ఫిర్యాదు

కారంపూడి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో శనివారం వైకాపా నాయకుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పుట్టినరోజు వేడుకల్లో మండల పరిషత్, ఉర్దూ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. వైకాపా నాయకులకు సహకరిస్తూ విద్యార్థులను వరుస క్రమంలో కూర్చోబెట్టడం తదితర దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొట్టడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. పాఠశాలల్లో జాతీయ నాయకుల జయంతి వేడుకలు తప్ప మిగిలిన వారి పుట్టిన రోజులు జరపకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ కారంపూడిలోని పాఠశాలలో ఉపాధ్యాయులు ఉల్లంఘించడం, అందులో ఉపాధ్యాయినులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొనటం చర్చనీయాంశమైంది. అడ్డుకోవాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థులకు కేకులు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేయించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎంఈవో రవికుమార్ మాట్లాడుతూ పాఠశాలలో రాజకీయనాయకుల పుట్టినరోజు వేడుకలు చేయకూడదని, అందులో పాల్గొన్న ఉపాధ్యాయులపై డీఈవోకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

గోకులం షెడ్డు.. పశు పోషకులకు వరం

- జిల్లాకు మరో 614 మంజూరు
- సెప్టెంబరు నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి

శావల్యాపురం, ముప్పాళ్ల (ఈపూరు), న్యూస్‌టుడే

పాడి పశువులకు రక్షణతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం గోకులం పేరిట రాయితీపై షెడ్లు నిర్మిస్తోంది. ఈ పథకం ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 614 షెడ్లు మంజూరు చేశారు. పాడి పశువులు, ఎద్దులు, మేకలు, గొర్రెల పెంపకందారులు ఈ పథకం ద్వారా నిర్మించుకోవచ్చు. అంతేకాకుండా గతేడాది 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లా మొత్తం మీద 180 షెడ్లు నిర్మాణం కాకుండా మిగిలిపోయాయని, వాటితో కలిసి మొత్తం 794 యూనిట్లు జిల్లాకు కేటాయించారు. ఎండ, వానల నుంచి పశువులు, గొర్రెలు, మేకలను సంరక్షించుకోవడానికి ఈ షెడ్లు గ్రామీణ ప్రాంతాల్లో ఎంతగానో దోహదపడనున్నాయి.



శావల్యాపురంలో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్డు

నిర్మాణ వ్యయం ఇలా.. గోకులం షెడ్లు నిర్మించుకునే రైతులు కచ్చితంగా మొత్తం వ్యయంలో 10శాతం రాయితీ సొమ్మును వెచ్చించాల్సి ఉంటుంది. మిగిలిన 90శాతం రాయితీని ప్రభుత్వం భరిస్తుంది. నాలుగు పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.1.80లక్షలు, ఆరు పశువులకు సరిపడా షెడ్డుకు రూ.2లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తారు.

దరఖాస్తు చేసుకోవచ్చు..

మండలాల వారీగా గోకులం షెడ్లు కేటాయించామని, అర్హులైన లబ్ధిదారుల నుంచి క్షేత్రసహాయకులు దరఖాస్తులు సేకరించి, వెంటనే పాలన ఆమోదం కోసం జిల్లా అధికారులకు అందజేయాలని పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. షెడ్డు మంజూరైన లబ్ధిదారుడు సెప్టెంబరు నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు.

వసూళ్ల కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: విదేశీయుడి పాస్‌పోర్టు పునరుద్ధరణకు రూ.5 లక్షలు డిమాండ్ చేసిన వ్యవహారంలో ఇద్దరు కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మాచర్లలో బంగ్లాదేశ్ దేశానికి చెందిన వ్యక్తి పాస్‌పోర్టు గడువు ముగియడంతో పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకున్నారు. కానిస్టేబుళ్లు డబ్బులు డిమాండ్‌చేసి ముందుగా కొంత తీసుకున్నట్లు బాధితుడు ఉన్నతాధికారుల విచారణలో తెలిపారు. దీంతో మాచర్లలో పనిచేస్తున్న ప్రత్యేక విభాగానికి చెందిన కానిస్టేబుల్‌తో పాటు జిల్లా కార్యాలయంలో అతనికి సహకరించిన మరో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. మాచర్ల కానిస్టేబుల్‌పై ఇదివరకే ఉన్న అవినీతి ఆరోపణలతోపాటు వైకాపా నాయకులకు పోలీసు శాఖకు చెందిన సమాచారాన్ని చేరవేశారన్న దానిపై కూడా విచారించినట్లు తెలిసింది.



బేస్‌బాల్ జట్టుకు ఎంపికైన పురుషులు, మహిళలతో నిర్వాహకులు

జిల్లా సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక

రొంపిచర్ల, న్యూస్‌టుడే: రొంపిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా పురుషులు, మహిళల సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వి.వేమారెడ్డి పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 120 మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిలో 20 మంది పురుషులు, మహిళల చొప్పున ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. మహిళలకు రొంపిచర్ల జడ్పీ స్కూల్‌లో, పురుషులకు మాచర్ల సెయింట్ ఆన్స్ పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన 16 మంది క్రీడాకారులను ప్రధాన జట్టుకు ఎంపిక చేసి సెప్టెంబరు 11, 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనేందుకు సిద్ధం చేయనున్నట్లు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.సైదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ వై.వి.చిరంజీవిరావు, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో గోల్డ్ అప్రయిజర్స్

గోల్డ్ అప్రయిజర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కీర్తి సురేష్

పండరీపురం (చిలకలూరిపేట పట్టణం), న్యూస్‌టుడే : ఎస్‌బీఐ నరసరావుపేట రీజియన్ గోల్డ్ అప్రయిజర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కీర్తి సురేష్ నియమితులయ్యారు. చిలకలూరిపేట పట్టణంలో ఈగల్ అతిథి ఫంక్షన్ హాలులో ఆదివారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఉపాధ్యక్షుడిగా కొమ్మూజు శ్రీనివాస్‌రావు, కార్యదర్శిగా గోవర్ధన్, కోశాధికారిగా కొత్త వెంకటేష్ నియమితులయ్యారు. అప్రయిజర్స్ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు గోల్డ్ అప్రయిజర్స్ అభినందించారు. నూతన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర స్వర్ణకార అధ్యక్షుడు క్రిరి వేణుమాధవ్, ఐ.ముత్యాలు, నలమాటి కొండలరావు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

త్రికోటేశ్వరుడికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే పూజలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండపై శ్రీత్రికోటేశ్వరస్వామి దేవస్థానాన్ని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ఆమెకు దేవస్థానం అధికారుల, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామిని దర్శించుకుని ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీస్సులు పలికారు. ఈవో చంద్రశేఖరరావు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.



ఎమ్మెల్యే మాధవికి స్వామి చిత్రపటం అందిస్తున్న ఈవో

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం

జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని గ్రామీణ గుంటూరు మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడుగా సి.హెచ్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పి.నాగరాజు, కోశాధికారిగా టి.శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా ఎ.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఆర్.వి.సింగరయ్య, డి.సుబ్రహ్మణ్యం, ఎం.ఎస్.నాగేంద్రం, ఆరాధ్యుల దుర్గా కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులుగా టి.సాంబశివరావు, బి.మధుసూదనరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కొమిరిశెట్టి నాగేశ్వరరావు, వి.ఎస్.వి.ప్రసాద్ ఎన్నికయ్యారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధ్యక్షుడు, కార్యదర్శి తెలిపారు.

పీజీఆర్ఎస్‌పై స్పందన తెలియజేయండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో పీజీఆర్ఎస్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందనను తెలియజేయాలని కలెక్టర్ కృతికాశుక్లా ప్రజలను కోరారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడం సాధ్యమవుతుందన్నారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో, డివిజనల్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో పీజీఆర్ఎస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయి పెంచేందుకు స్పందన కోరుతుందన్నారు. పీజీఆర్ఎస్ కేంద్రాల్లో ప్రజల అభిప్రాయ సేకరణ క్యూఆర్ కోడ్‌లు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అలాగే అర్జీ పరిస్థితిని 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. మెరుగైన సేవలందించేందుకు ప్రజలు అర్జీలతో పాటు స్పందన తెలిపి సహకరించాలని సూచించారు. జిల్లాలోని పీజీఆర్ఎస్ కేంద్రాల వద్ద క్యూఆర్ కోడ్ స్కానర్‌ను పౌరులు కన్పించేలా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కొత్త వాహనాలకు 24 గంటల్లోనే నంబరు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: వాహనాలు కొనుగోలు చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ కోసం రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. నంబరు రావడానికి కనీసం నెల రోజుల సమయం పట్టేది. ఇదంతా గతం. ప్రస్తుతం ఈ పద్ధతి మారింది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. దీంతో ఒక్క రోజులోనే వాహనానికి నంబరు రానుంది. అధికారులు ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసేందుకూ ఈ విధానంలో ఇకపై వీల్లేదు.

దళారులు ఉండరిక.. గతంలో వాహన రిజిస్ట్రేషన్లు అంటే దళారులను ఆశ్రయిస్తే త్వరగా పని పూర్తవుతుందనే విమర్శలుండేవి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానానికి చెక్ పెట్టింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను డిజిటల్ విధానం ద్వారా సులభతరం చేసింది. నంబరు ప్రక్రియ సంబంధిత డీలర్ స్థాయిలోనే కొనసాగనుంది. వాహనం కొనుగోలు చేసిన తర్వాత వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను డీలరే రవాణా శాఖ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపుతారు. అధికారులు వాటిని పరిశీలించి నంబరు కేటాయిస్తారు.

జాప్యానికి తావు లేదు.. పత్రాల పరిశీలన, నంబరు కేటాయింపులో అధికారులు జాప్యం చేయడానికి వీలుండదు. కార్యాలయంలో ఆలస్యం చేసినా 24 గంటలు దాటిన వెంటనే నంబరు కేటాయించినట్లు వాహనదారునికి సమాచారం వెళ్తుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరంపై అటు డీలర్లు, ఇటు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా రవాణాశాఖాధికారి సంజీవ కుమార్ మాట్లాడుతూ వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లోనే పూర్తి కావడం శుభపరిణామన్నారు. ఇకపై వాహనదారుడు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, వాహనం విక్రయించిన డీలరే సంబంధిత పత్రాలను తమకు పంపుతారన్నారు. వాటిని పరిశీలించి నంబరు కేటాయిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిదికి చేరిన మృతులు

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మహిళ మృతి

చిలకలూరిపేట గ్రామీణ, గుంటూరు (నగరంపాలెం), న్యూస్‌టుడే : పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో అడ్డరోడ్డు వద్ద ఆటోను ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. ఈనెల 26న అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చిలకలూరిపేట మండలం వేలూరు ఎస్సీ కాలనీకి చెందిన ఏడుగురు మృతి చెందగా మరో ఎనిమిది మంది గాయపడిన విషయం తెలిసిందే. గుంటూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో చౌటుపల్లి సుబ్బులు (55) శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని గుంటూరు నుంచి వేలూరు గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సానుభూతి తెలిపారు. ప్రభుత్వపరంగా వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.



సుబ్బులు (పాత చిత్రం)

ఒకే కుటుంబంలో నలుగురు.. ఈ సంఘటన ఒకే ఇంట్లో తీరని దుఃఖాన్ని మిగిల్చింది. వేలూరు ఎస్సీ కాలనీలో రామయ్య భార్య సువార్త, తల్లి లక్ష్మమ్మ, చిన్న అక్క గంగమ్మ ప్రమాదం జరిగిన రోజే మృతి చెందగా ఆదివారం పెద్ద అక్క సుబ్బులు చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాద రూపంలో నలుగురు కుటుంబ సభ్యులను కోల్పోయిన రామయ్య దిక్కుతోచని స్థితిలో ఉండిపోయాడు. పెళ్లయిన కుమారుడు, కుమార్తె ఉన్నప్పటికీ తన తల్లి, భార్య, తోబుట్టువులను కోల్పోయానని రామయ్య తల్లడిల్లిపోతున్నాడు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ ఎన్నిక

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీని ఆదివారం విజయవాడలోని ఏఐటీయూసీ భవనంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రకటించారు. రాష్ట్ర కమిటీలో నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో వార్డు సచివాలయ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఇద్దరికి చోటుదక్కింది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ మహమ్మద్ అలీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షేక్ కరీముల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు వారు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా విప్పర్తి నిఖిల్ కృష్ణ, జనరల్ సెక్రటరీగా బి.ఆర్.ఆర్ కిషోర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భార్గవ్ సుతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. నూతన రాష్ట్ర కార్యవర్గం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనకు కృషి చేస్తుందన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 257.
కృష్ణా జిల్లాలో వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

గూడ్స్ రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

మల్లమ్మసెంటర్(నరసరావుపేట), సాతులూరు(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం సాతులూరు - నరసరావుపేట రైల్వేస్టేషన్ల మధ్య 43వ కిలోమీటర్ వద్ద గూడ్స్ రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు ఆదివారం మృతి చెందాడు. మృతుడికి 20 నుంచి 25 సంవత్సరాలు ఉండవచ్చునని, తెలుపు రంగు టీషర్ట్, లేత నీలి రంగు నిక్కరు ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నరసరావుపేట రైల్వే పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో ఉంచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే ఎస్సై 9247585720, 7013600365 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గంజాయి రవాణా కేసులో నిందితులకు రిమాండ్

కారంపూడి (దుర్గి), న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిందితులకు రిమాండ్ విధించారు. దుర్గి మండలం అడిగొప్పల గ్రామ శివారులోని మిరియాల మేజరు వద్ద అక్రమంగా కారులో గంజాయి రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దుర్గి ఎస్సై గోపాల్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి నిందితులు వినుకొండకు చెందిన ఏసయ్య, వెంకటేశ్వర్లు, సాగర్ బాబు, అడిగొప్పలకు చెందిన రామాంజయ్యలను అరెస్టు చేశారు. వారి నుంచి 2.300 కిలోల గంజాయితో పాటు ఒక కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని ఆదివారం మాచర్ల కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు కారంపూడి సీఐ భాస్కర్ తెలిపారు.

కారును ఢీకొన్న మినీ లారీ

నలుగురికి గాయాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై చీకటీగలపాలెం వద్ద సర్వీసు రోడ్డులో వేగంగా ప్రయాణిస్తున్న మినీ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఇనుప గ్రిల్స్‌ను దాటుకుని పక్క రోడ్డులో వెళ్తున్న కారును ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండలో ఓ దుకాణం నుంచి పాత కాగితాలు, ప్లాస్టిక్ సామాన్లను మినీ లారీలో నింపి బిహార్‌కు చెందిన డ్రైవర్ మార్కాపురం వైపు ఆదివారం వెళ్తున్నాడు. అదే సమయంలో గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన యన్నం కిరణ్, రావుల అజయ్, తులసి, త్రినాథ్ శ్రీశైలంలో పెళ్లి పనులు ముగించుకుని కారులో స్వగ్రామం వస్తున్నారు. వేగంగా ప్రయాణిస్తున్న మినీ లారీ అదుపుతప్పి సర్వీసు రోడ్డు దాటి మధ్యలో ఉన్న ఇనుప గ్రిల్స్‌ను దూసుకెళ్తూ పక్కన ప్రధాన రోడ్డులోకి వచ్చి అటుగా వెళ్తున్న కారును బలంగా ఢీకొంది. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలై కారులోనే ఇరుక్కుపోయారు. గ్రామస్థులు వచ్చి అద్దాలు పగలగొట్టి వారిని బయటకు తీసి 108లో వినుకొండ వైద్యశాలకు తరలించారు. రోడ్డుకు అడ్డంగా లారీ, మరో వైపు కారు నిలిచిపోవడంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. లారీ డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. అతన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు.



దెబ్బతిన్న కారు, మినీ లారీ

150 మందికి వైద్య సేవలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శంకర్ కంటి వైద్యశాల, రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల సంయుక్తంగా ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించాయి. రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గుండా అశోక్‌బాబు శిబిరాన్ని ప్రారంభించారు. ఈశిబిరానికి పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన 150 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో 100మందికి కంటి శుక్ల శస్త్రచికిత్సలు చేయాలని నిర్ధారించారు. వారిని బస్సులో పెదకాకానిలోని శంకర్ కంటి వైద్యశాలకు తరలించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు పి.పాండయ్య గుప్తా, కోశాధికారి డీవీ స్వామి, సంయుక్త కార్యదర్శి ఎ.చిన గంగాధర్, జి.సుబ్రహ్మణ్యం, కె.రమేష్, పి.సుబ్రహ్మణ్యం, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

బాధిత కుటుంబాలకు బీమా నగదు అందజేత

రెంటచింతల, మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. అడిగొప్పల గ్రామానికి చెందిన అరికట్ల వెంకట్రామయ్య, రెంటచింతలకు చెందిన పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. ఆయా కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, శౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ✿ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన నిర్మాణ కార్మికుడు షేక్ జానీబాషా (58) కుటుంబానికి సీపీఐ పట్టణ తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ? పట్టణంలోని నాలుగోవార్డులోని దోబీ ఘాట్ బజారులో రోడ్డు వెంబడి నాలుగైదు చోట్ల చెత్త, వ్యర్థాల కుప్పలు ఉన్నాయి. దుర్వాసనతోపాటు దోమల వ్యాప్తితో ఇబ్బంది పడుతున్నాం. చెత్తకు నిప్పు పెడుతున్నారు. పరిసరాలను శుభ్రం చేయాలి. **- స్థానికులు, నాలుగోవార్డు.** ✔ రోడ్డుపైన చెత్త, వ్యర్థాల కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- విజయసారథి, శానిటరి ఇన్‌స్పెక్టర్.** ? ఆకులగణపవరంలో వీధిదీపాలు వెలగక రాత్రిపూట బయటకు రావాలంటే భయంగా ఉంది. **-ఏసులు, ఆకులగణపవరం.** ✔ ప్రైవేటు సిబ్బందిని నియమించి విద్యుత్తు స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **-రవికుమార్, పంచాయతీ కార్యదర్శి, రాజుపాలెం, న్యూస్‌టుడే**


నిఘా నివేదికల్లో.. భద్రత గాల్లో

నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద కొరవడిన రక్షణ చర్యలు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలంటున్న పర్యాటకులు

విజయపురిసౌత్, మాచర్ల, రాయవరం, కారంపూడి, వెల్దుర్తి, న్యూస్‌టుడే

దేశంలో తొమ్మిది భారీ నీటి పారుదల ప్రాజెక్టులపై తీవ్రవాదుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రాష్ట్ర నిఘా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు డ్యామ్‌లను గతంలో పరిశీలించారు. నిఘా పెంచాలని కేంద్రానికి నివేదికలు పంపించారు. ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్, కుడి, ఎడమ ఎర్త్ డ్యామ్‌ల ముఖద్వారాల వద్ద నిఘా కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించినా చేయలేదు. నాగార్జునసాగర్ లాంచీస్టేషన్ వద్ద మెటల్ డిటెక్టర్ ఏర్పాటు చేసినా అది మరమ్మతులకు గురైంది. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అవి సక్రమంగా పనిచేయడంలేదు. నాగార్జునకొండపైన ఉన్న మ్యూజియంలో వెలకట్టలేని వస్తువులున్నాయి. ఇక్కడ సీసీ కెమెరాలు లేవు. 2006 ఏప్రిల్ 30న మావోయిస్టులు లాంచీలను కొండ వద్ద అపహరించి నీటిలో పేల్చివేసిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. సాగర్- మాచర్ల ప్రధాన రహదారి నుంచి 3 కి.మీ. దూరంలో ఉన్న ఎత్తిపోతలకు అటవీ ప్రాంతంలో వెళ్లాల్సి ఉంటుంది. అనుపు, నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద హైమాస్ట్ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలన్న నిఘా విభాగాల సూచనలు నెరవేరలేదు. నాగార్జునసాగర్ డ్యామ్, నాగార్జునకొండ, అనుపు, ఎత్తిపోతల వద్ద భద్రత సిబ్బంది ఆయుధాలు లేకుండా విధులు నిర్వహిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. దేశ విదేశాల నుంచి ఎంతోమంది పర్యటకులు ఇక్కడకు వస్తుంటారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే దేశ ప్రతిష్ఠతోపాటు సాగర్ పర్యటక కేంద్రానికి మాయని మచ్చగా మిగిలే అవకాశం ఉంది. నాగార్జున సాగర్ డ్యామ్‌కు అతి సమీపంలోని పోలీసు స్టేషన్ వద్ద ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దాన్ని తర్వాత మూసివేశారు. 2003, 2007లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఫైర్ స్టేషన్ లేనందున మిర్యాలగూడ, మాచర్ల నుంచి ఫైర్ ఇంజిన్లు తెప్పించాల్సి వచ్చింది. నాగార్జునసాగర్ డ్యామ్ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు, కోట్ల మందికి తాగునీరు అందుతోంది. ఇంతటి నేపథ్యం ఉన్న కట్టడాల వద్ద భద్రత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యాటకులు కోరుతున్నారు.


నాగార్జునసాగర్ డ్యామ్


నాగార్జునకొండ మ్యూజియం

వేధింపులపై నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న సీఐ నాగమల్లేశ్వరరావు

సత్తెనపల్లి, రఘురామ్‌నగర్- న్యూస్‌టుడే: ఆత్మవిశ్వాసం, పట్టుదలతో బాలికలు చదువులో రాణించాలని పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. స్థానిక రఘురామ్‌నగర్‌లోని బీసీ బాలికల వసతిగృహంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెడు, మంచి స్పర్శలపై బాలికలు అవగాహనతో మెలగాలని, వేధింపుల విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ఏ సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కొనే విధంగా బాలికలు ఉండాలన్నారు. చదువుతో ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రెంటచింతల, న్యూస్‌టుడే: రెంటచింతల తహసీల్దార్ దీప్తి ఆదివారం స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బూత్‌ల వద్ద ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ఓటర్లకు అనువుగా సదుపాయాలు ఉన్నాయా..లేవా అని ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి, బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వెంకటరమణ, నాసరయ్య పాల్గొన్నారు.

ఇళ్ల వద్దనే వృద్ధుల ఓట్ల విచారణ


వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: మాచర్ల మండలం ఏకోనాంపేట, కొత్తూరు గ్రామాల్లో సర్ ప్రక్రియలో భాగంగా గతంలో నోటీసులు జారీ చేసిన ఓటర్ల వివరాలను తహసీల్దారు కిరణ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాలను సేకరించి విచారించారు. కొత్తూరు గ్రామంలో అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడి వివరాలను తహసీల్దారు కిరణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ మరియదాసు, బూత్‌స్థాయి అధికారి, కార్యాలయ సిబ్బంది పరిశీలించారు. నోటీసులు అందుకున్న వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఓటర్ల వివరాలను ఇళ్లవద్దనే పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మాచవరం, న్యూస్‌టుడే: మాచవరంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి మండల పరిధిలో ఆదివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. అలానే మండల పరిధిలోని సాగర్ కాలువల్లో నీరు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కుంటలు, చెరువులు, మంచినీటి ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

విజయపురిసౌత్: మాచర్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో సర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల వివరాలను తహసీల్దార్ కిరణ్‌కుమార్ తన బృందంతో కలిసి సేకరించారు. కొత్తూరు, ఏకోనాంపేటలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో నోటీసులు అందుకున్న ఓటర్ల గురించి తెలుసుకున్నారు. అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. అవసరమైన వివరాలను నమోదు చేసుకున్నారు. హౌసింగ్ ఏఈ మరియదాసు, బూత్‌స్థాయి అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు పడాలి.. పంటలు పండాలి

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

విజయపురి సౌత్, న్యూస్‌టుడే: మాచర్ల మండల పరిధిలోని ద్వారకాపురి గ్రామంలో కోదండ రామాలయ జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ రాజబోయిన మధుయాదవ్, వైస్ ఛైర్మన్ గుండాల శ్రీనివాస యాదవ్, పార్టీ మండల అధ్యక్షులు వీరాస్వామి, గట్ల కోటిరెడ్డి, అన్నపురెడ్డి వెంకటరెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డి, గన్నెబోయిన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: వర్షాలు కురిసి పంటలు పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని జమ్మలమడక రోడ్డులో ఉన్న రామప్ప దేవాలయంలో ఎరువుల కంపెనీల డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ఘటాభిషేకాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నీటితో నింపిన డ్రమ్ముల్లో వేద పండితులు మునిగి ప్రత్యేక జపాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

మొక్కపాడు, బీరవల్లిపాయ(రాజుపాలెం): మొక్కపాడులో కొలువుదీరిన పోలేరమ్మకు ఆదివారం గ్రామస్థులు కొలుపులు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు చేసి అమ్మవార్లకు సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుకున్నారు. బీరవల్లిపాయలో పాటిపాటిమ్మతల్లికి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ✿ అనుపాలెం బోడుపై కొలువుదీరిన ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. గ్రామంతోపాటు, దూర ప్రాంతాల్లో ఉండే గ్రామస్థులందరూ తరలివచ్చారు. పొంగళ్లు చేసి ఒకేసారి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : వర్షాలు కురిసి సాగు, తాగు నీటికి ఇబ్బందుల్లేని పరిస్థితులు నెలకొనాలని కోరుకుంటూ ముప్పాళ్ల గ్రామస్థులు పైడమ్మతల్లికి నీళ్లు పోసి పొంగళ్లు పెట్టారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


రాజుపాలెంలో..

దాచేపల్లి: దాచేపల్లి మండలంలోని గామాలపాడులో ముత్యాలమ్మ తల్లి బోనాల జాతరను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెంటచింతల: తుమ్మకోట ఊరముత్యాలమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. వర్షాలు కురవాలని, వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ గురువారం నుంచి వేడుకలు నిర్వహిస్తున్నారు. వేడుకల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గురజాల మండలం చర్లగుడిపాడులో గంగమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమతో అభిషేకాలు చేశారు. ✿ గంగవరంలోని ముత్యాలమ్మ తిరునాళ్లను ఆలయ కమిటీవారు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలు తెచ్చి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: మాచర్లలో చౌడమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో మహిళలు ఊరేగింపుగా యాదవుల బజారు నుంచి చెన్నకేశవ స్వామి ఆలయం మీదుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.


మాచర్లలో బోనాల ఊరేగింపు

కారంపూడి (వెల్దుర్తి): తితిదే శ్రీవాణి ట్రస్టు మంజూరు చేసిన రూ.40 లక్షలతో వెల్దుర్తి మండలం బోదిలవీడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోలేరమ్మ అమ్మవారి ఆలయ పనులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన ద్వారా శాంతి నెలకొంటుందన్నారు. రామాంజరెడ్డి, శివారెడ్డి, రామకృష్ణ, వెంకయ్య, శ్రీనివాసరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి : పట్టణంలోని గుంటూరు రోడ్డులోని శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ఆదివారం విద్యార్థులు సామూహిక ఉపనయనం చేశారు. ఆశ్రమ వేద పాఠశాల ప్రధానాచార్యులు రత్నమాచార్యులు ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థులు పాల్గొని గురువుల ఆశిస్సులు పొందారు. ఆశ్రమ బాధ్యులు రమేష్, సురేష్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

నర్సరీల్లోనే నారు.. ఆందోళనలో రైతులు



ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్ మొదలై మూడు నెలలు అవుతున్నా ఇంతవరకు సరైన వర్షాలు పడలేదు. అడపాదడపా పడిన జల్లులకు కొంత సాగు చేసినా.. ఇంకా పొలాలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే మిరప, కంది పంటలు వేసేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు. చాలా మంది రైతులు మిరప నారును నర్సరీల్లో పెంచుతున్నారు. వర్షాలు లేకపోవడంతో నర్సరీల్లోనే నారు ముదురుతోంది. కొందరు రైతులు తలలు తుంచి వేస్తున్నారు. వర్షం పడకపోతే సాగు చేయలేమని రైతులు ఆందోళన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, మాచవరం**

పెచ్చులూడి పడుతున్నా పట్టదా?



దుర్గి, న్యూస్‌టుడే: మండల విద్యావనరుల కేంద్ర కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడిపడుతుండటంతో భవనం ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఎమ్ఈవో గది, రికార్డులగది, స్టాకు గదుల్లో ఇనుప ఊచలు బయటపడి పెచ్చులూడి పడుతున్నాయి. రాత్రి పూట వర్షం పడితే మరుసటి రోజు దస్త్రాలను ఆరపెట్టుకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం నుంచే వచ్చే పుస్తకాలు, ఇతర సామగ్రి ఈ భవనంలోనే ఉంచి సరఫరా చేస్తుంటారు. భవనం శిథిలమై ప్రమాదకరంగా మారినా మరమ్మతులు కానీ, నూతన భవనం నిర్మాణం కానీ పట్టడంలేదని, ప్రమాదం జరిగితే విద్యాశాఖే బాధ్యత వహించాల్సి ఉంటుందని మండలంలోని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించినట్లు మండల విద్యాశాఖాధికారులు రమేష్‌బాబు, బెంజిమెన్‌లు తెలిపారు. ఇటీవల మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో కూడా ప్రస్తావించామన్నారు.

ఇళ్లమధ్య కంపచెట్లు.. వసతుల్లేక అవస్థలు



గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గురజాల నగర పంచాయతీ పరిధిలోని కాలనీలో రహదారులు, కాలువలు, తాగునీటి సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కాలనీలో 1332 మందికి పట్టాలు ఇచ్చారు. పూర్తిస్థాయిలో వసతులు కల్పించక పోవడంతో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు. నిర్మించుకున్న వారు వేరేచోటుకు వెళ్లలేక నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇళ్ల మధ్యలో కంప, పిచ్చిచెట్లు మొలిచి అడవిని తలపిస్తున్నాయని, విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలను పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అమూల్య అన్నారు. ఆదివారం క్రోసూరులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయంబర్స్‌మెంటు చెల్లించక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గుంటూరు- క్రోసూరు బస్సు మోడల్ స్కూల్ వరకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అచ్చంపేటలో కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలన్నారు. బాబి, కల్యాణ్, ప్రవీణ్, కిషోర్ పాల్గొన్నారు.

రక్తదానం విలువైన సామాజిక సేవ

అచ్చంపేట, న్యూస్‌టుడే: రక్తదానం ఎంతో విలువైన సామాజిక సేవ అని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని ఎస్సై సంధ్యారాణి అన్నారు. ఆదివారం అచ్చంపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో రెడ్‌క్రాస్, స్నేహహస్తాలు ఫౌండేషన్ సహకారంతో లంబోదర మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం 45మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, కరీముల్లాబాబు, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని యువకుడి మృతి


గోపీనాథ్ (పాతచిత్రం)

రెడ్డిగూడెం, రాజుపాలెం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన మాచర్ల-గుంటూరు మార్గంలో రాజుపాలెం-రెడ్డిగూడెం మధ్య శనివారం రాత్రి జరిగింది. కస్తూర్బా బాలికల పాఠశాల సమీపంలో మినీ ట్రక్‌ను నిలిపి టైరు మారుస్తున్నారు. అదే సమయంలో బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలేనికి చెందిన మన్నెం గోపీనాథ్ (31) ద్విచక్రవాహనంపై వెళ్తూ నిలిపి ఉంచిన వాహనాన్ని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువులు అక్కడి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మణికృష్ణ తెలిపారు.

బీరుసీసాతో దాడి.. యువకుడికి గాయాలు

గ్రంథసిరి(అచ్చంపేట), న్యూస్‌టుడే: అచ్చంపేట మండలం గ్రంథసిరి గ్రామానికి చెందిన యువకులు క్రికెట్ ఆడేందుకు క్రోసూరులోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఆదివారం సాయంత్రం వెళ్లారు. వారి మధ్య గొడవ జరిగింది. శాఖమూరి చెంగయ్య బీరుసీసాతో కిలారి సతీష్‌ను గాయపరిచాడు. సతీష్‌ను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

రెంటచింతల, న్యూస్‌టుడే : రెంటచింతల పొలిమేరలో ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 26న పాలువాయిజంక్షన్ నుంచి అంబాపురానికి ద్విచక్రవాహనంపై వెళుతున్న రంగనాయక్, మరియబాబులను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారు గుంటూరు, హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. బాధితల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగార్జున తెలిపారు.

ఆర్టీసీ యూనియన్ నాయకుడికి నివాళి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: తుమ్మలచెరువు గ్రామానికి చెందిన ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు, తెదేపా నాయకుడు పాలెపోగు వరప్రసాద్ ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆర్టీసీ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య వరప్రసాద్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

శిక్షణ కేంద్రం.. పునరుద్ధరిస్తే ఉపాధికి ఊతం

దుర్గి, వెల్దుర్తి, కారంపూడి, మాచర్ల, కుమ్మరిపాలెం, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తోంది. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వేలాది మంది చర్మకారులకు ఉపాధి మార్గాలు చూపేందుకు దుర్గి మండలం అడిగొప్పలలో ఉన్న శిక్షణ కేంద్రాన్ని మాత్రం పట్టించుకోవడంలేదు. దీన్ని ప్రారంభిస్తే ఆమేరకు యువతకు ఉపాధి కల్పించేందుకు వీలుంటుంది. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టిసారించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మాణం చేసిన మినీ లెదర్‌పార్కును పట్టించుకోకపోవడంతో అందులో ఏర్పాటు చేసిన లక్షలాది రూపాయల విలువైన యంత్రాలు తుప్పుపట్టి పాడవుతున్నాయి.

30 ఎకరాల్లో నిర్మాణం

అడిగొప్పల సమీపంలో 2003లో ఉద్యానవన శాఖకు చెందిన 30 ఎకరాల్లో రూ.20 లక్షలతో మినీ లెదర్‌పార్కును ఏర్పాటు చేశారు. 2004న యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మించారు. అధునాతన యంత్రాలను సమకూర్చి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటి అధికారుల నిర్లక్ష్యంతో మూడునెలలకే ఇది మూతపడింది. ఆతర్వాత 2012లో ఉమ్మడి రాష్ట్రంలోని కొన్ని లెదర్ పార్కులను అభివృద్ధిచేసేందుకు అప్పటి ప్రభుత్వం రూ.12 కోట్లు నిధులు కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. అందులో అడిగొప్పల లెదర్‌పార్కుకూడా ఉంది. ఆ నిధులు మంజూరు అయ్యిఉంటే అడిగొప్పల లెదర్‌పార్కులోనే ముడిపదార్థాల నుంచి ఉత్పత్తుల వరకు దారం, సొల్యూషన్, సోల్, పాదరక్షలు, బూట్లు, లెదర్‌బ్యాగ్‌లు తయారీ పరిశ్రమ ఏర్పాటయ్యేది. యువతకు ఉపాధి లభించేది.


లెదర్‌పార్కులో నిరుపయోగంగా యంత్రాలు

లక్ష్యం నీరుగారిందిలా..

2003లో అప్పటి తెదేపా ప్రభుత్వం యువత పెడదోవ పడకుండా ఉండేందుకు 6వేల మందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పించేందుకు ప్రారంభించిన ప్రాజెక్టు ప్రయోజనం లేకుండా పోయింది. విలువైన యంత్రాలు మూలనపడి తుప్పు పడుతున్నాయి. ఆరంభంలో శిక్షణకు యువత బాగానే ముందుకు వచ్చినా ఉపకారవేతనం ఇవ్వకపోవడంతో చాలామంది వెనుదిరిగారు. శిక్షణ పొందినవారు జీవనోపాధి లభించక, బ్యాంకు రుణాలు అందక నిరాశ చెందారు. కానీ యువత ముందుకు రావడం లేదన్న సాకుతో కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నం చేయడంతో తర్వాత మూలనపడింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై దృష్టిసారించి శిక్షణ కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని, యువతకు ఉపాధి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నరసరావుపేట

విజయవంతంగా ముగిసిన కార్యశాల

నరసరావుపేట అర్బన్: కొండవీడు ఈఎన్‌టీ వైద్యశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన హ్యాండ్స్ ఆన్ లైవ్ సర్జికల్స్ కార్యశాల విజయవంతంగా నిర్వహించినట్లు కార్యనిర్వాహక డైరెక్టర్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జూనియర్ డాక్టర్లకు సీనియర్ల అనుభవాలను తెలియజేసేందుకు కార్యశాల ఏర్పాటు చేశామన్నారు. కొత్తతరం ఈఎన్‌టీ సర్జన్లకు జ్ఞానమార్పిడి, శస్త్రచికిత్సల నైపుణ్యాలు అందించడం, విశ్వాసం పెంపొందించేందుకు కార్యశాల దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా 36 మందికి ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా శస్త్రచికిత్సలు చేసినట్లు వివరించారు. కార్యశాలకు సహకారం అందించిన వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ శ్రీవర్షిణి, శేఖరరెడ్డి, విష్ణురాజ్, సీఈవో మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.






రంగు మారి..పురుగులతో నిండి..

తాగునీటి సరఫరాపై
కాకాని వాసుల ఆందోళన

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే


మండలంలోని కాకాని గ్రామంలో తాగునీరు రంగు మారి సరఫరా అవుతుండడంతో గ్రామస్థులు కలవరపాటుకు గురవుతున్నారు. వారం రోజులుగా తాగునీరు రంగుమారి వస్తుందని దీనిపై పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు రంగుమారి రావటంతో పాటు ఎరుపు రంగు పురుగులు నీటిలో వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఆ నీటిని తాగితే ఎక్కడ రోగాల బారిన పడతామోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటిలో కనీసం బ్లీచింగ్ కలపడం లేదని దీంతో రంగు మారడంతో పాటు వాసన కూడా వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. నెల క్రితం ఓ వారం పాటు తాగునీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం రంగుమారి, పురుగులు వస్తున్న నీరు తాగి ఎక్కడ ఆసుపత్రి మెట్లు ఎక్కాల్సి వస్తుందోనని భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జానీబాషాను వివరణ అడగ్గా చెరువులో తాగునీరు అడుగంటడంతో నీరు కొంచెం రంగు మారిందన్నారు. రెండు, మూడ్రోజుల్లో సాగర్ జలాలు చెరువుకు చేరుతాయని, నీటిలో బ్లీచింగ్ చల్లించి పురుగులు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.




ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు

ఈపూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఇనుమెళ్లలో రూ.3.62కోట్లతో చేపట్టనున్న శ్రీ సోమేశ్వర స్వామి, శ్రీ భావన్నారాయణ స్వామి దేవాలయాల పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. తొలుత రూ.2.52కోట్లుతో చేపట్టనున్న శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం, అనంతరం రూ.1.10కోట్లుతో చేపట్టనున్న శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తన సతీమణి లీలావతితో కలిసి పూజలు నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర సహకార బ్యాంకు ఛైర్‌పర్సన్ మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టరు రాపర్ల జగ్గారావు, వినుకొండ గ్రూపు దేవాలయాల ఈవో సుధాకరరెడ్డి, లింగా శివలింగప్రసాదు, అబ్బూరి సీతారామయ్య, గోనుగుంట్ల వెంకట కోటేశ్వరరావు, మోహనరావు, గుత్తా వీరయ్య, చింతల పిచ్చయ్య పాల్గొన్నారు.





కూటమి పాలనలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

పండరీపురం (చిలకలూరిపేట పట్టణం), నరసరావుపేట సెంట్రల్, నూజండ్ల, న్యూస్‌టుడే : కూటమి రెండేళ్ల పాలనలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు అన్నారు. తమ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తెదేపా కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. చిలకలూరిపేటలో 9, 10, 11, 17 వార్డుల్లో రూ.95లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్లతో పాటు ఇతర పనుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం రెండేళ్ల ప్రభుత్వ విజయాలు, సంక్షేమ పథకాల కరపత్రాలను స్వయంగా ఇంటింటికి తిరిగి ప్రజలకు అందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, షేక్ రఫాని తదితరులు పాల్గొన్నారు. నరసరావుపేట మండలం యల్లమంద పంచాయతీ పరిధిలోని శ్రీనివాసగిరిజన కాలనీలో ఇంటింటికి తెదేపా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సెప్టెంబరు 2న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నరసరావుపేట రానున్నారని, పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నూజండ్ల మండలం బుర్రిపాలెంలో మండల తెదేపా అధ్యక్షుడు గంగినేని బాబు ఇంటింటికి తెదేపా నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తోడుగా నిలవాలని కోరారు.


చిలకలూరిపేట: కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి


నరసరావుపేట: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అరవిందబాబు





పొంగలి పెట్టి.. ప్రభలు కట్టి..

వర్షం కురవాలని పూజలు


ప్రభతో ఊరేగింపుగా కావూరు వాసులు

కావూరు, గాంధీపేట (చిలకలూరిపేట గ్రామీణ, పట్టణం), నూజండ్ల: రాష్ట్రంలో వర్షాలు కురిసి రైతులంతా సుభిక్షంగా ఉండేలా గణనాథుడు ఆదుకోవాలని వేడుకుంటూ చిలకలూరిపేట మండలం కావూరు గ్రామస్థులు, చిలకలూరిపేట పట్టణం సూదావారిపాలెం వాసులు పొంగలి చేసి ఊరేగింపుగా ప్రభ కట్టి నాదెండ్ల నందికుంట విఘ్నేశ్వర ఆలయం వద్దకు ఆదివారం చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నూజండ్లలో రామయోగి స్వామికి, నాలుగు దిక్కుల్లో పాదులకు 108 బిందెలతో వరుసగా అయిదో ఆదివారం జలాభిషేకం చేశారు. గ్రామస్థులంతా సామూహికంగా వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. గురపనాయుడుపాలెంలో సీతారామస్వామి దేవాలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి, పోలేరమ్మకు అభిషేకాలు నిర్వహించి వనభోజనాలు చేశారు.

ఆదర్శ పాఠశాలకు బోరు సదుపాయం

చిరుమామిళ్ల(చిలకలూరిపేట గ్రామీణ): నాదెండ్ల మండలం చిరుమామిళ్ల ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామాభివృద్ధి ప్రదాత, గోల్కొండ గ్రూప్ సంస్థల ఛైర్మన్ నడికట్టు రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన తన సొంత నిధులతో పాఠశాలలో ఆదివారం బోరు వేయించారు. రెండు నెలల క్రితం బాలికల వసతిగృహంలో కుంగిపోయిన బండలను తొలగించి ఫ్లోరింగ్ కూడా చేయించారు. ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారం అందించినప్పుడే పాఠశాలలకు మౌలిక వసతులు సమకూరుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపల్ పద్మజ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తితో సాయం చేయాలి

ఈపూరు: ప్రజలు సామాజిక స్ఫూర్తితో సంఘటితంగా సాయం అందిస్తే ఆపన్నులకు చేయూత అందుతుందని 'ఈపూరు మాలపల్లి సేవా సొసైటీ' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మేడికొండ కుమార్ అన్నారు. ఈపూరు ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న గుడిపూడి సుజాతకు వైద్య ఖర్చుల కోసం సంస్థ ద్వారా రూ.20వేలు ఆర్థిక సాయం, పండ్లు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు వేళంగి కుమార్, కార్యదర్శి దేవయ్య, సంయుక్త కార్యదర్శి భాగ్యరాజు, కోశాధికారి డేవిడ్‌రాజు, సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల వర్తక సంఘం అధ్యక్షుడి మృతికి సంతాపం


శ్రీనివాసరావు (పాత చిత్రం)

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండ కూరగాయల వర్తక సంఘం అధ్యక్షుడు, తెదేపా నాయకుడు సుంకర శ్రీనివాసరావు(56) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలో శృంగారవనంలోని తన నివాసంలో డాబాపైకి ఎక్కి ఫోన్ మాట్లాడుతుండగా అకస్మాత్తుగా తీవ్ర గుండెనొప్పితో కుప్పకూలారు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆయనను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి అప్పటికే మృతి చెందినట్లు చెప్పడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. శ్రీనివాసరావు మృతికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, కాపు సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.





ఐఐటీలతో పాటు దేశంలోని మేటి విద్యా సంస్థల్లో ఉన్నత విద్యకూ, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (పీఎస్‌యూ)ల్లో అత్యున్నత కొలువులకూ దారి చూపుతుంది గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్). మేటి అవకాశాలకు బాటలు వేసే ఈ ప్రకటన ఇటీవలే వెలువడింది. బీటెక్‌తో పాటు ఇతర డిగ్రీల వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. సరైన ప్రణాళికకు నిబద్ధతను జోడిస్తే సాధారణ విద్యార్థులూ ఇందులో రాణించవచ్చు.

విస్తృత అవకాశాలకు గేట్ వే





ఐఐఎస్సీ, ఐఐటీలతో పాటు అత్యున్నత సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీల్లో ప్రవేశానికీ, పబ్లిక్ సెక్టార్ సంస్థలైన మహారత్న, నవరత్న, మినీరత్నల్లో ఉన్నత ఉద్యోగాలకూ రెండింటికీ గేట్ దారి చూపుతుంది. ప్రైవేటు సంస్థలూ ఈ స్కోరుతో విద్య, ఉన్నత ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తున్నాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పరీక్ష ఇది. అందుకే గేట్ ప్రాధాన్యం ఏటా పెరుగుతోంది. బీటెక్ సిలబస్‌లో అరవై శాతంపై దృష్టి సారిస్తే ఇందులో విజయం సాధించవచ్చు. గేట్ స్కోరు పీజీ ప్రవేశాలకు మూడేళ్లు, పీఎస్‌యూల్లో నియామకానికి ఒకటి లేదా రెండేళ్లు చెల్లుతుంది.

స్టైపెండ్

గేట్-2027ను ఐఐటీ మద్రాస్ నిర్వహించనుంది. ఈ స్కోరుతో ఇంజినీరింగ్/ టెక్నాలజీ/ సైన్స్/ ఫార్మసీ/ ఆర్కిటెక్చర్/ హ్యూమానిటీస్ సంబంధిత విభాగాల్లో/ శాఖల్లో మాస్టర్ ప్రోగ్రామ్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం లభిస్తుంది. గేట్‌తో ఎంటెక్‌లో చేరినవారు ప్రతి నెలా రూ.12,400 స్టైపెండ్ అందుకోవచ్చు. ఇదే స్కోరుతో నేరుగా పీహెచ్‌డీలోనూ చేరిపోవచ్చు. వీరికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000, మూడో ఏట నుంచి ఐదో సంవత్సరం వరకూ నెలకు రూ.42,000 స్టైపెండ్ అందుతుంది.

ప్యాకేజీ

మహారత్న, నవరత్న, మినీరత్న హోదా పొందిన ప్రభుత్వరంగ సంస్థలు గేట్ స్కోరుతో సుమారు రూ.6 లక్షల నుంచి రూ.22 లక్షల వరకూ వార్షిక వేతనం అందిస్తున్నాయి. ఓఎన్‌జీసీ, ఐఓసీఎల్, ఎన్‌టీపీసీ, గెయిల్, బార్క్, హెచ్‌పీసీఎల్.. ఇలా 70కి పైగా సంస్థల్లో అవకాశం ఉంటుంది. వీటిలో ఏటా కనీసం 30-40 సంస్థలు నియామకాలు చేపడుతున్నాయి. అవకాశాలు సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచీల వారీ ఉంటాయి.

✦ గేట్ స్కోరుతోనే సాఫ్ట్‌వేర్, ఐటీ సంస్థలూ, ఇతర బహుళజాతి సంస్థలూ ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం, పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూ ద్వారా అవకాశం కల్పించడం చేస్తున్నాయి.

పరీక్ష

ఈ సారి 30 పేపర్లలో గేట్ నిర్వహిస్తున్నారు. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ పేపర్‌ను కొత్తగా చేర్చారు. సిలబస్‌తో పాటు కొన్ని పేపర్ కోడ్‌లూ మారాయి. అభ్యర్థులు అవకాశాన్ని బట్టి రెండు పేపర్లలో పరీక్ష రాసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 300కు పైగా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇంజినీరింగ్ విభాగాల పరీక్షలో 100 మార్కులకు 65 ప్రశ్నలు ఉంటాయి. వ్యవధి మూడు గంటలు. ప్రశ్నాపత్రంలో రెండు విభాగాలుంటాయి.

విభాగం-1 (జనరల్ ఆప్టిట్యూడ్): ఇందులో పది ప్రశ్నలుంటాయి. ఒక మార్కు ప్రశ్నలు 5, రెండు మార్కుల ప్రశ్నలు 5 వస్తాయి. ఈ విభాగంలోని నాలుగు నుంచి ఐదు ప్రశ్నలు ఇంగ్లిష్ (వెర్బల్ ఎబిలిటీ) నుంచి, మిగతా ప్రశ్నలు క్వాంటిటేటివ్‌కు సంబంధించినవై ఉంటాయి.

విభాగం-2 (సంబంధిత ఇంజినీరింగ్ సబ్జెక్టులు) మొత్తం 55 ప్రశ్నలుంటాయి. ఇందులో ఒక మార్కు ప్రశ్నలు 25, రెండు మార్కుల ప్రశ్నలు 30 ఉంటాయి.

✦ ఇంజినీరింగ్ విభాగాలైతే.. జనరల్ ఆప్టిట్యూడ్ 15 మార్కులకు, ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్ 13 మార్కులకు, కోర్ సబ్జెక్టు ప్రశ్నలు 72 మార్కులకు ఉంటాయి. ఎక్కువ ప్రశ్నలు సంబంధిత రంగాల్లోని నూతన ఆవిష్కరణలపై వస్తాయి. అభ్యర్థులు ఎంచుకున్న పేపర్ ప్రకారం ప్రశ్నల సంఖ్యలో మార్పులు ఉంటాయి.

ప్రశ్నలు ఇలా

ఈ ఆన్‌లైన్ పరీక్షలో ప్రశ్నాపత్రం పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఇందులో మూడు రకాల ప్రశ్నలు అడుగుతారు.

1. బహుళైచ్ఛిక ప్రశ్నలు: నాలుగు ఆప్షన్లు ఇస్తారు. అందులో ఒకటే సరైనది. దాన్నే గుర్తించాలి.

2. బహుళ ఎంపిక ప్రశ్నలు: ఇవి కూడా బహుళైచ్ఛిక ప్రశ్నలుగానే ఉంటాయి. కానీ ఇందులో ఒకటి కంటే ఎక్కువ సరైన ఆప్షన్లు ఉంటాయి. ఇచ్చిన నాలుగు ఆప్షన్లలో మూడు సరైనవైతే ఆ సరైన మూడు ఆప్షన్లూ గుర్తించాలి. ఒకవేళ ఒకటి లేదా రెండు సరైన ఆప్షన్లు గుర్తిస్తే ఎలాంటి మార్కులూ ఇవ్వరు.

3. సంఖ్యా సమాధాన ప్రశ్నలు (న్యూమరికల్): ఎలాంటి ఆప్షన్లూ ఉండవు. సమాధానాలు వర్చువల్ కీబోర్డును ఉపయోగించి రాయాలి.

✦ గేట్‌లో తప్పు సమాధానానికి ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో మూడో వంతు తగ్గిస్తారు. అంటే ఒక మార్కు ప్రశ్నకు 1/3, రెండు మార్కులదైతే 2/3చొప్పున మైనస్ మార్కులుంటాయి. న్యూమరికల్ ప్రశ్నలకూ, బహుళ ఎంపిక ప్రశ్నలకూ రుణాత్మక మార్కులుండవు.

సన్నద్ధత

✦ పరీక్ష విధానాన్ని అర్థం చేసుకోవడంతో పాటు మీరు రాయాలనుకున్న పేపర్‌కు సంబంధించి సిలబస్‌లో మార్పులు గమనించాలి.

✦ అధ్యయనంలో పాత ప్రశ్నాపత్రాలే దిక్సూచి. వీటిని పరిశీలిస్తే ఏ అంశాలు, ఏ కాన్సెప్టులకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తోందో తెలుసుకోవచ్చు. వేటిపై అధిక దృష్టి సారించాలో అర్థం చేసుకుని, ప్రణాళిక వేసుకోవాలి.

✦ గేట్ ఫిబ్రవరిలో ఉంటుంది. అంటే ఇప్పటి నుంచీ 5 నెలల కంటే ఎక్కువ సమయమే అందుబాటులో ఉంది. ఈ వ్యవధిలో సన్నద్ధత పూర్తిచేసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

✦ ప్రతి సబ్జెక్టులోనూ ఒకటి లేదా రెండే ప్రామాణిక పుస్తకాలు తీసుకుని, వాటినే బాగా చదవాలి.

✦ ఎన్‌టీపీఈఎల్ పాఠాలు ప్రాథమిక అంశాలను అవగాహన చేసుకోవడానికి తోడ్పడతాయి. అలాగే విశ్లేషణాత్మక ప్రశ్నలకు సమాధానాలు రాయడానికీ ఉపయోగపడతాయి. అందువల్ల వాటినీ శ్రద్ధగా వినాలి.

✦ ఏదైనా అంశం చదవడం పూర్తయిన తర్వాత అందులో అధిక సంఖ్యలో మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. ఆ తర్వాత మాక్ టెస్టు రాసి, సన్నద్ధత ఎలా ఉందో తెలుసుకోవాలి.

✦ సిలబస్ మొత్తం చదవడం పూర్తయిన తర్వాత అసలైన గేట్‌ను పోలి ఉండే మాక్ టెస్టులు విస్తృతంగా రాయాలి. ఇవి రాస్తున్నప్పుడు చేస్తోన్న తప్పులపై ప్రత్యేక దృష్టి సారించాలి. అవి తర్వాతి పరీక్షల్లో రాకుండా చూసుకోవాలి.

✦ పలు పీఎస్‌యూలు నిర్వహిస్తోన్న పరీక్షల ప్రశ్నాపత్రాలూ గేట్ అధ్యయనంలో ఉపయోగపడతాయి. ఇవన్నీ గమనించడం వల్ల ఒక అంశాన్ని ఎన్ని రకాలుగా పరీక్షలో అడగవచ్చో తెలుసుకోవచ్చు.

వివరాలు

అర్హతలు: ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, కామర్స్, సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** గరిష్ఠ పరిమితి లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబరు 27. **దరఖాస్తు ఫీజు:** మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1000. మిగిలిన అందరికీ రూ.2000. **పరీక్ష తేదీలు:** ఫిబ్రవరి 6, 7, 13, 14, 20, 21. **వెబ్‌సైట్:** https://gate2027.iitm.ac.in

"గేట్‌లో విజయానికి బీటెక్ మొత్తం సిలబస్ చదవాల్సిన అవసరం లేదని గుర్తుంచుకోవాలి. నాలుగేళ్ల ఇంజినీరింగ్ సిలబస్‌లో దాదాపు 60 శాతమే పరీక్షలో భాగంగా ఉంటుంది. ఇంజినీరింగ్ బ్రాంచీ మూలాలు, నూతన పోకడలకే అధిక ప్రాధాన్యం. ఇప్పటి నుంచీ రోజుకు 8 గంటలు కేటాయిస్తే సిలబస్ మొత్తం క్షుణ్నంగా చదివేయొచ్చు. కాన్సెప్టుల వారీ అర్థంచేసుకుని, అధ్యయనం కొనసాగించాలి"

చదువు

e-mail: edc@eenadu.in

సివిల్స్ కోసం ఏ కోర్సు బాగు?

ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతున్నాను. నా లక్ష్యం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్. ఇందుకు అనుగుణంగా యూజీలో ఏ కోర్సులో చేరితే బాగుంటుంది? - వినోద్



■ సివిల్స్ రాయడానికి ఏదైనా గుర్తింపు పొందిన డిగ్రీ సరిపోతుంది. అయితే, ఎంచుకునే కోర్సు సివిల్స్ సన్నద్ధతకు ఎంతవరకు ఉపయోగపడుతుంది? విద్యార్థి ఆసక్తి, సామర్థ్యాలకు సరిపోతుందా? ఒకవేళ సివిల్స్‌లో ఆశించిన ఫలితం రాకపోతే ప్రత్యామ్నాయ కెరియర్‌కు ఉపయోగపడుతుందా? అనే అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి.

▶ సామాజిక, రాజకీయ, చరిత్ర, ఆర్థిక అంశాలపై ఆసక్తి ఉండి, సివిల్సే ప్రధాన లక్ష్యమైతే బీఏలో పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ లాంటి సబ్జెక్టులను ఎంచుకోవడం మంచి నిర్ణయం. డిగ్రీలోనే వీటిని చదవడం వల్ల సివిల్స్ ప్రిపరేషన్ కొంత సులభమవుతుంది. వ్యాసరచన, విశ్లేషణాత్మక సమాధానాలు రాయడంలోనూ ప్రయోజనం ఉంటుంది. అలాగే పొలిటికల్ సైన్స్, హిస్టరీ లాంటి సబ్జెక్టులను మెయిన్స్‌లో ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశమూ ఉంటుంది.

▶ ఎంపీసీ విద్యార్థులకు బీఎస్సీ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ లేదా డేటా సైన్స్ మంచి ఎంపికలు. ఇవి సివిల్స్‌లోని సీశాట్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్‌కు ఉపయోగపడతాయి. ఒకవేళ సివిల్స్‌లో రాణించలేకపోతే స్టాటిస్టిక్స్, డేటా అనలిటిక్స్, ఐటీ, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, ఫైనాన్స్, మార్కెట్ రిసెర్చ్ లాంటి రంగాల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలూ ఉంటాయి.

▶ సివిల్స్ రాయడానికి బీటెక్ కూడా మరో ప్రత్యామ్నాయం. ఇంజినీరింగ్ ద్వారా టెక్నికల్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రైవేట్ రంగం, ప్రభుత్వ సాంకేతిక ఉద్యోగాలు, ఉన్నత విద్య లాంటి అవకాశాలు ఉంటాయి. అయితే బీటెక్‌లో తరగతులు, ల్యాబ్‌లు, ప్రాజెక్టుల భారం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున సివిల్స్ ప్రిపరేషన్‌కు ప్రత్యేకంగా సమయం కేటాయించాలి.

▶ సివిల్స్‌లో విజయం సాధించలేకపోయినా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సివిల్స్ ప్రిపరేషన్ ఎంతో ఉపయోగపడుతుంది.

సివిల్సే ప్రధాన లక్ష్యంగా సామాజిక శాస్త్రాలపై ఆసక్తి ఉంటే బీఏ పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ అనుకూలం. సివిల్స్‌తో పాటు బలమైన ప్రత్యామ్నాయ కెరియర్ కూడా కావాలంటే బీఎస్సీ స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ లేదా బీటెక్‌నూ పరిశీలించవచ్చు. ఏ డిగ్రీ ఎంచుకున్నా మొదటి సంవత్సరం నుంచే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, కరెంట్ అఫైర్స్, వార్తాపత్రిక పఠనం, వ్యాసరచన, ఆన్సర్ రైటింగ్‌ను క్రమంగా కొనసాగించడం ఉత్తమ వ్యూహం.



- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎన్‌ఎఫ్‌సీలో అప్రెంటిస్‌లు

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ), హైదరాబాద్.. ఏడాది అప్రెంటిస్‌షిప్ కోసం వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. ● ఐటీఐ ట్రేడ్ : 432 ఖాళీలు ● డిప్లొమా ఇంజినీరింగ్: 79 ఖాళీలు ● గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్: 27 ఖాళీలు. **విభాగాలు/ ట్రేడులు:** మెకానికల్ ఇంజినీరింగ్, కెమికల్, మెటలర్జికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు. **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అవసరం. **వయసు:** 18 ఏళ్లు నిండాలి. **స్టైపెండ్:** నెలకు ఐటీఐ అప్రెంటిస్‌లకు రూ.11,040; సీఓపీఏ, డీజిల్ మెకానిక్, కార్పెంటర్, ప్లంబర్, వెల్డర్‌లకు రూ.10,560; డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.10.900; గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.12,300. **ఎంపిక:** ఇంటర్వ్యూతో. **దరఖాస్తు:** ఎన్ఏపీఎస్, ఎన్ఏటీఎస్ పోర్టల్ ద్వారా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16. **వెబ్‌సైట్:** https://www.nfc.gov.in/

తాగునీటి అవసరాలకే వినియోగించాలి

శావల్యాపురం, న్యూస్‌టుడే : సాగర్ జలాలను కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని, అలా కాకుండా ఇతర అవసరాలకు వినియోగించే వారిపై చర్యలు చేపడతామని లింగంగుంట్ల సర్కిల్ డీఈఈ విజయలక్ష్మీ తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు బ్రాంచి కెనాల్‌కు 850 క్యూసెక్కుల నీరు విడుదల చేశారని పేర్కొన్నారు. 14 రోజులపాటు నీరు విడుదల చేస్తారని, ఈ సమయంలో బ్రాంచి కెనాల్ పరిధిలోని మంచినీటి చెరువులను పూర్తిగా నింపాలని, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో నీటిని నింపే ప్రక్రియ పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఏఈ పోట్లూరు లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

మహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


ఈవోకు నగదు అందిస్తున్న దాతలు

ఇస్సపాలెం (నరసరావుపేట సెంట్రల్), న్యూస్‌టుడే: మండలంలో ఇస్సపాలెంలోని శ్రీమహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మక్కెళ్ల బసవయ్య, అంజమ్మ దంపతులు రూ.1,01,116 నగదును విరాళంగా ఈవో మాధవిదేవికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బండ్లమూరి చంద్రశేఖర్, దాతల బంధువులు ఏడుకొండలు, అరుణ, దుర్గా లక్ష్మీప్రసాద్, కార్తీకలక్ష్మీ, అర్చకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంచినీటి సరఫరా నిలిపివేత

శావల్యాపురం, న్యూస్‌టుడే : ప్రస్తుతం తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలు విడుదల చేసినందున శావల్యాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు శుభ్రత పనుల కోసం వారం రోజుల పాటు గ్రామంలోకి నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుధీర్ తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో ఉన్న కొద్దిపాటి నీటిని బయటకు పంపించి, బ్లీచింగ్ చల్లి, సాగర్ జలాలతో పూర్తిగా నింపిన తరువాత గ్రామంలోకి నీటిని విడుదల చేస్తామన్నారు. గ్రామస్థులంతా సహకరించాలని కోరారు.